శతక గర్జన

సెంచరీలతో గిల్, రోహిత్ విజృంభణ • పడిక్కల్, సర్ఫరాజ్ అర్ధసెంచరీలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 437-8 • ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు పోరు

ధర్మశాల టెస్టులో భారత బ్యాటర్లు దుమ్మురేపారు. ఇంగ్లండ్ బ్యాటర్లు విఫలమైన చోట మనోళ్లు శతక గర్జన పూరించారు. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్‌గిల్ సూపర్ సెంచరీలతో చెలరేగిన వేళ.. టీమ్‌ఇండియా భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతున్నది. ఇంగ్లిష్ బౌలర్లను దునుమాడుతూ గిల్, రోహిత్ సెంచరీలకు తోడు దేవదత్ పడిక్కల్, సర్ఫరాజ్‌ఖాన్ అర్ధసెంచరీలతో చెలరేగారు. మొత్తంగా టాప్-5 బ్యాటర్లు అర్ధసెంచరీలు, సెంచరీలతో కదంతొక్కారు. మిడిలార్డర్ తడబడినా..ఆఖర్లో కుల్దీప్, బుమ్రా నిలదొక్కుకోవడంతో రోహిత్‌సేన పటిష్ట స్థితిలో నిలిచింది. రోజంతా చెమటోడ్చిన ఇంగ్లండ్ ఏడు వికెట్లతో సరిపెట్టుకుంది.

ధర్మశాల: హిమాలయ పర్వత పాదాల్లో భారత్, ఇంగ్లండ్ ఆఖరి పోరు ఆసక్తికరంగా సాగుతున్నది. ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే కట్టడిచేసిన టీమ్‌ఇండియా బ్యాటింగ్‌లో ఇరుగదీస్తున్నది. స్పిన్ తంత్రంతో ఇంగ్లండ్ కుదేలైన పిచ్‌పై భారత బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ (162 బంతుల్లో 103, 13ఫోర్లు, 3సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్(150 బంతుల్లో 110, 12ఫోర్లు, 5సిక్స్‌లు) సూపర్ సెంచరీలతో విజృంభించడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 8 వికెట్ల నష్టానికి 473 పరుగులు చేసింది. వీరికి తోడు అరంగేట్రం బ్యాటర్ దేవదత్ పడిక్కల్(103 బంతుల్లో 65, 10ఫోర్లు, సిక్స్), సర్ఫరాజ్‌ఖాన్(60 బంతుల్లో 56, 8ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో రాణించారు. అయితే లోయార్డర్‌లో జడేజా (15), జురెల్ (15), అశ్విన్ (0) నిరాశపరిచారు. ఆఖర్లో కుల్దీప్‌యాదవ్ (27 నాటౌట్), బుమ్రా (19 నాటౌట్) క్రీజులో నిలదొక్కుకోవడంతో తిరిగి వికెట్లు చేజార్చుకోలేదు. మొత్తంగా రెండు వికెట్ల చేతిలో ఉన్న టీమ్‌ఇండియా ప్రస్తుతం 255 పరుగుల కీలక ఆధిక్యంలో కొనసాగుతున్నది. షోయబ్ బషీర్ (4-170), టామ్ హార్ట్‌లే (2-126) ఆకట్టుకున్నారు.

గిల్, రోహిత్ విజృంభణ:

ఓవర్‌నైట్ స్కోరు 135-1 రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ దూకుడు ప్రదర్శించింది. పిచ్ బౌలింగ్‌కు అంతగా అనుకూలించని వేళ..అదునుగా భావిస్తూ రోహిత్, గిల్..ఇంగ్లండ్ బౌలర్లను ఓ ఆటాడుకున్నారు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ బౌండరీలతో స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. ఎక్కడా తడబాటుకు లోనుకాకుండా నింపాదిగా ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. వీరిని విడదీసేందుకు ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. లంచ్ విరామ సమయానికి సింగిల్ ద్వారా రోహిత్ టెస్టుల్లో 12వ సెంచరీని ఖాతాలో వేసుకుంటే..బషీర్ బౌలింగ్‌లో మూడచక్కని ఫోర్ ద్వారా గిల్ శతకాన్ని పూరించాడు. రోహిత్ తన ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, 3 భారీ సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో రోహిత్ 64 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద క్యాచ్ ఔట్ ప్రమాదం నుంచి బయటపడి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లంచ్ సమయానికి వికెట్ నష్టపోకుండా 129 పరుగులు జోడించింది. మళ్లీ బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా వరుస విరామాల్లో రోహిత్, గిల్ వికెట్లను కోల్పోయింది. ఈ సిరీస్‌లో తొలిసారి బౌలింగ్‌కు దిగిన స్టోక్స్ సూపర్‌స్పింగ్‌తో రోహిత్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత నాలుగు పరుగుల వ్యవధిలో గిల్‌ను అండర్సన్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. అయితే ఇక్కడ మ్యాచ్‌పై పట్టు బిగించాలనుకున్న ఇంగ్లండ్‌కు..పడిక్కల్, సర్ఫరాజ్ దీటుగా నిలబడ్డారు. ఆడుతున్నది తొలి టెస్టు అయినా..పడిక్కల్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరోవైపు సర్ఫరాజ్..పడిక్కల్‌కు చక్కని సహకారం అందించాడు. పేస్ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్న సర్ఫరాజ్ ఒక వైపు అయితే పడిక్కల్ ఫ్రంట్‌ఫుట్, బ్యాక్‌ఫుట్ డ్రైవ్‌లతో చూడచక్కని బౌండరీలు కొట్టాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని బషీర్ విడగొట్టాడు. స్లిప్‌లో రూట్ క్యాచ్‌తో ఖాన్ పెవిలియన్ చేరడంతో నాలుగో వికెట్‌కు 97 పరుగుల పార్టనర్‌షిప్‌నకు ఫుల్‌స్టాప్ పడింది. బషీర్ బౌలింగ్‌లో పడిక్కల్ బోల్డ్ కావడంతో ఇన్నింగ్స్ ఇబ్బందుల్లో పడింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన పడిక్కల్, జడేజా, అశ్విన్ వెంటవెంటనే ఔటయ్యారు. దీంతో ఆలౌట్ అవుతుందా అనుకున్న తరుణంలో కుల్దీప్‌యాదవ్, బుమ్రా ఇంగ్లండ్ బౌలర్లను ఎదురొడ్డి నిలిచారు.

4 టెస్టుల్లో ఇంగ్లండ్‌పై టాప్-5 బ్యాటర్లు అర్ధసెంచరీ, అంతకంటే ఎక్కువ పరుగులు సాధించడం భారత్‌కు ఇది తొలిసారి. ఓవరాల్‌గా నాలుగోసారి టీమ్‌ఇండియా ఈ ఫీట్ అందుకుంది.

2 అన్ని ఫార్మాట్లలో కలిపి 48 సెంచరీలు పూర్తి చేసుకున్న రోహిత్‌శర్మ.. ప్రస్తుత టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సరసన నిలిచాడు.

సంక్షిప్త స్కోరు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218 ఆలౌట్, భారత్ తొలి ఇన్నింగ్స్: 473-8(గిల్ 110, రోహిత్ 103, బషీర్ 4-170, హార్ట్‌లే 2-126)

యూపీ సంచలనం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ సంచలనం సృష్టించింది. శుక్రవారం ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో యూపీ 1 పరుగు తేడాతో టేబుల్ టాపర్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై అద్భుత విజయం సాధించింది. యూపీ నిర్దేశించిన 139 పరుగుల లక్ష్యఛేదనలో ఢిల్లీ 19.5 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్ (60) అర్ధసెంచరీతో రాణించగా, మిగతావారు దారుణంగా విఫలమయ్యారు. దీప్తిశర్మ (4-19) నాలుగు వికెట్లతో విజృంభించింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 138-8 స్కోరు చేసింది. దీప్తిశర్మ (59) అర్ధసెంచరీతో కదంతొక్కింది. సాధు, రాధా యాదవ్ రెండేసి వికెట్లు తీశారు. దీప్తిశర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ప్రిక్వార్టర్స్‌లో నిశాంత్‌దేవ్

బస్టో అర్సిజియో(ఇటలీ): వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయర్ టోర్నీలో భారత యువ బాక్సర్ నిశాంత్‌దేవ్..ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 71కిలోల బౌట్‌లో నిశాంత్ 5-0తో మెడియన్ ఎస్కర్టన్(ఇటలీ)ను మట్టికరిపించాడు. మరోవైపు పురుషుల 92 కిలోల బౌట్‌లో సంజీత్ 0-5తో ఐబెక్(కజకిస్థాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. మహిళల 66కిలోల విభాగం తొలి రౌండ్‌లో అంకుషిత బొరో 2-3తో సాన్వికో ఎమిలె (ఫ్రాన్స్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

నాగల్ ఔట్

ఇండియన్ వెల్స్: ప్రతిస్థాత్మక ఇండియన్ వెల్స్ టోర్నీలో భారత యువ యువ ప్లేయర్ సుమిత్ నాగల్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రా తొలి రౌండ్‌లో నాగల్ 3-6, 3-6తో మిలోస్ రవోనిక్(కెనడా) చేతిలో ఓటమిపాలయ్యాడు. గంటా 28 నిమిషాల పాటు జరిగిన పోరులో నాగల్ స్థాయికి తగ్గ ఆటతీరును కనబర్చలేక పోయాడు. రవోనిక్ తన 12 బ్రేక్ పాయింట్లలో మూడు పాయింట్లను కాపాడుకుంటే నాగల్ రెండింటిని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు.

రాజకీయాల్లోకి షమీ!

న్యూఢిల్లీ: భారత స్పీడ్‌స్టర్ మహమ్మద్ షమీ త్వరలో రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తరపున పశ్చిమబెంగాల్‌లో పోటీ చేసే చాన్స్ ఉంది. కుడికాలి చీలమండ గాయానికి ప్రస్తుతం శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న షమీని బీజేపీ ఇటీవల సంప్రదించినట్లు తెలిసింది. బెంగాలోని బసిర్‌హత్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా పార్టీ పెద్దలు షమీ వైపు మొగ్గుచూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల తీవ్ర దుమారం రేపిన సందేశ్‌ఖాలీ ప్రాంతం ఈ నియోజకవర్గ పరిధిలోనిదే. ఇదిలా ఉంటే షమీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని తెలిసింది. వన్డే ప్రపంచకప్ తర్వాత గాయపడ్డ షమీ..గాయంతో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌తో పాటు ఐపీఎల్‌కు పూర్తిగా దూరమైన సంగతి తెలిసిందే.

కివీస్ 162 ఆలౌట్

ఆసీస్‌తో రెండో టెస్టు

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. ఆసీస్‌కు టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. హాజిల్‌వుడ్(5-31) ఐదు వికెట్ల విజృంభణకు తోడు మిచెల్ స్టార్క్(3-59) ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిలలాడిపోయారు. కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న కేన్ విలియమ్సన్(17), కెప్టెన్ టిమ్ సౌథీ(26) తీవ్రంగా నిరాశపరిచారు. పచ్చికతో కళకళలాడుతున్న పిచ్‌పై హాజిల్‌వుడ్ తన స్వింగ్‌తో కివీస్‌కు ముచ్చెమటలు పట్టించాడు. స్వింగ్ బౌలింగ్‌తో వరుస విరామాల్లో కివీస్ బ్యాటర్లను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ శుక్రవారం ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. మార్నస్ లబుషేన్(45), లియాన్(1) క్రీజులో ఉన్నారు. మ్యాట్ హెన్రీ(3-39) మూడు వికెట్లతో రాణించాడు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న ఆసీస్ 38 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది.

తొలి వన్డే అఫ్గాన్‌దే

ఐర్లాండ్‌పై విజయం

షార్జా: ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ 35 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అఫ్గన్ 1-0తో ముందంజ వేసింది. అఫ్గన్ నిర్దేశించిన 311 పరుగుల లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 50 ఓవర్లలో 275-8 స్కోరుకు పరిమితమైంది. హ్యారీ టెక్టర్(138) సెంచరీతో కదంతొక్కగా, లోర్కన్ టకర్(85) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఫజుల్లా ఫారుఖీ(4-51), ఒమర్‌జాయ్(2-47) రాణించారు. అంతకుముందు అఫ్గన్ నిర్ణీత 50 ఓవర్లలో 310-5 స్కోరు చేసింది. ఓపెనర్ రహమనుల్లా గుర్బాజ్(121) సెంచరీతో విజృంభించగా, ఇబ్రహీం జద్రాన్(60), కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ(50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. వాన్ వోర్కమ్(3-55) మూడు వికెట్లు తీశాడు. గుర్బాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సింధు నిష్క్రమణ

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 24-22, 17-21, 18-21తో రెండోసీడ్, ఒలింపిక్ చాంపియన్ చెన్ యు ఫీ(చైనా) చేతిలో పోరాడి ఓడింది. గాయం నుంచి కోలుకుని తిరిగి కోర్టులో అడుగుపెట్టిన సింధు దాదాపు గంట సేపు జరిగిన మ్యాచ్‌లో అద్భుత పోరాటపటిమ కనబరిచింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో 6-12, 11-15తో వెనుకబడినా..పుంజుకుని గెలిచింది. కానీ రెండు, మూడు గేమ్‌ల్లో ప్రత్యర్థికి దీటుగా బదులివ్వడంలో విఫలమైన సింధు మ్యాచ్ చేజార్చుకుంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ 21-19, 21-13తో సుపక్ జొంకో, కెజెన్(థాయ్‌లాండ్) జోడీని ఓడించి సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి గేమ్‌ను కష్టంగా గెలిచిన సాత్విక్, చిరాగ్ జంట..మలిగేమ్‌ను అలవోకగా దక్కించుకున్నారు. సెమీస్‌లో మిన్ హ్యుక్ కాంగ్, సెయింగ్ జయె(కొరియా) జోడీతో తలపడనున్నారు.

తీపికబురు

బ్యాంక్ ఉద్యోగుల జీతాలు 17% పెంపు

ఐబీపీ, యూనియన్ల మధ్య కుదిరిన ఒప్పందం

న్యూఢిల్లీ, మార్చి 8: బ్యాంక్ ఉద్యోగుల వేతనాలు భారీగా పెరగనున్నాయి. వార్షిక జీతాన్ని 17 శాతం పెంచే ప్రతిపాదనకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్లు శుక్రవారం ఒక అంగీకారానికి వచ్చాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని 8 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం కల్పించే ఈ పెంపుతో బ్యాంక్‌లపై ఏడాదికి రూ. 8,284 కోట్ల భారం పడుతుంది. 2022 నవంబర్ నుంచి అమలయ్యేలా ఈ పెంపుదల ఉంటుందని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ వెల్లడించింది. వివరాలు:

- కొత్త వేతన ఒప్పందం ప్రకారం 8088 పాయింట్ల డీఏను, ఆపై వచ్చినదానిని విలీనపర్చిన తర్వాత కొత్త పే స్కేల్స్‌ను నిర్ణయించారు. – మహిళా ఉద్యోగులందరూ మెడికల్ సర్టిఫికేట్ సమర్పించాల్సిన అవసరం లేకుండానే నెలకు ఒక రోజు సిక్ లీవ్ తీసుకోవచ్చు.
- రిటైర్‌మెంట్ లేదా సర్వీసులో ఉండగా మరణిస్తే ఆ సమయానికి 255 రోజుల వరకూ ప్రివిలేజ్ లీవ్‌లను నగదుగా తీసుకోవచ్చు.
- రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్/ఫ్యామిలీ పెన్షన్‌కు అదనంగా మంథ్లీ ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని చెల్లిస్తారు.

ఐదు రోజులే పని

అలాగే శనివారాలన్నింటికీ సెలవులుగా గుర్తించేందుకు అంగీకరించినట్లు తెలిపింది. అయితే 5 రోజుల పనిదినాలపై ప్రభుత్వ అంగీకారం కోసం చూస్తున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పనిగంటల సవరణ ఉంటుందని కాన్ఫడరేషన్ వివరించింది. వేతన ఒప్పందంపై పీఎన్‌యూ బ్యాంక్ యాజమాన్యాల అసోసియేషన్ ఐబీఏ, ఉద్యోగుల యూనియన్లు యూఎఫ్‌బీయూ, ఏఐబీవోపీ, ఏఐబీఏఎస్ఎం, బీకేఎస్ఎంలు సంతకాలు చేసినట్లు ఐబీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అఫీసర్ సునీల్ మెహతా ట్వీట్ చేశారు.

స్థిరాస్తి బాగుంటేనే రాష్ట్రాభివృద్ధి

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): స్థిరాస్తి రంగం బాగుంటేనే రాష్ట్ర అభివృద్ధి జోరుగా సాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ క్రెడాయ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైటెక్స్ వేదికగా 13వ ఎడిషన్ ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ల విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్న మాట నిజమేనని, ఈ విషయంలో బిల్డర్లు తమ అనుభవాలను సలహాలు, సూచనల రూపంలో ఇస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని 360 డిగ్రీలలో అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మూసీ సుందరీకరణ, ఎలివేటెడ్ కారిడార్, పాతబస్తీలో మెట్రో విస్తరణతోపాటు రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాను మరింత పెంచుతామని తెలిపారు. ఇన్నర్ రింగు, ఔటర్ రింగు, రీజినల్ రింగు రోడ్డులకు అనుసంధానంగా రేడియల్ రోడ్లు, లింకు రోడ్లు, అప్రోచ్ రోడ్లతో రహదారులను

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొంగులేటి తదితరులు

అభివృద్ధి చేస్తామని చెప్పారు. తమది ఫ్రెండ్లీ సర్కార్ అని, రియల్టర్లు అని, వ్యాపారులు అని వేర్వేరుగా చూడబోమని అన్నారు. ధరణిలో పెండింగ్‌లో దాదాపు తొమ్మిది లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, రెవెన్యూ లొసుగులను తొలగించి సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రగతికి నిర్మాణ రంగం వెన్నెముకలా పనిచేస్తున్నదని, ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలని ఆశిస్తున్నామని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తీసుకునే పాలసీలో బిల్టర్ల తరపున సలహాలు, సూచనలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రాపర్టీలో రెరా అనుమతించిన 100కు పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి, ఐసీబీసీ వైర్మన్ శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ ప్రతినిధులు గుమ్మి రాంరెడ్డి, రామకృష్ణారావు, జైదీప్‌రెడ్డి, జగన్నాథరావు, కొత్తపల్లి రాంబాబు, బీ ప్రదీప్‌రెడ్డి, మురళీమోహన్, శ్రీకాంత్, మనోజ్‌కుమార్ అగర్వాల్, క్రాంతి కిరణ్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య

మే 20 నుంచి స్పెక్ట్రమ్ వేలం

న్యూఢిల్లీ, మార్చి 8: మరోసారి స్పెక్ట్రమ్ వేలానికి కేంద్రం సిద్ధమైంది. ఈ ఏడాది మే 20న స్పెక్ట్రమ్ యాక్షన్ మొదలవబోతున్నది. ఈ మేరకు శుక్రవారం దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెలికం శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రాబోయే స్పెక్ట్రమ్ వేలంలో కేంద్ర ప్రభుత్వం 8 శ్రేణుల్లోని రేడియో తరంగాలను అమ్మకానికి పెడుతున్నది. మొబైల్ ఫోన్ సేవల కోసం ఈ స్పెక్ట్రమ్ వేలం జరుగుతుండగా, కనీస ధరను రూ.96,317.65 కోట్లుగా నిర్ణయించారు. కాగా, దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీలకు చెందిన స్పెక్ట్రమ్‌తోపాటు ఈ ఏడాదితో కాలపరిమితి ముగియనున్న స్పెక్ట్రమ్‌ను కూడా మళ్లీ కొత్తగా వేలం వేయనున్నారు. 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్ట్జ్‌తోపాటు 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్లలో అందుబాటులో ఉన్న స్పెక్ట్రమ్‌ను వేలానికి తెస్తున్నారు. ఈ స్పెక్ట్రమ్ వేలంలో పాల్గొనే సంస్థలు ఏప్రిల్ 22లోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. మే 9న బిడ్డర్ల తుది జాబితాను ప్రకటిస్తారు.

సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు జాతీయ అవార్డు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): సమర్థ నీటి వినియోగంలో మంచి ర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి అత్యుత్తమ యూనిట్‌గా జాతీయ అవార్డు లభించింది. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ థర్మల్ ప్లాంట్లకు జాతీయస్థాయి బహుమతులు అందజేశారు. ఇందులో సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బెస్ట్ నేషనల్ వాటర్ ఎఫిషియంట్ యూనిట్ అవార్డు లభించింది. 500 మెగావాట్ల పైబడిన సామర్థ్యం గల సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలలో సింగరేణి ప్లాంటు ఈ అవార్డును సాధించడం పట్ల సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్ డీ సత్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. సాధారణంగా థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పాదనకు గరిష్ఠంగా మూడు ఘనపు మీటర్ల నీటిని వినియోగించడాన్ని ప్రామాణికంగా భావిస్తారు. కానీ థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఈ ప్రమాణాన్ని దాటే నీటిని వినియోగిస్తుంటారు. సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రంలో తీసుకున్న ప్రత్యేక చర్యలు, వినియోగిస్తున్న సాంకేతికత వలన ఒక గంటలో ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పాదనకు నిర్దేశించిన పరిమాణం కన్నా తక్కువగా అంటే.. 2.8 ఘనపు మీటర్ల నీటిని మాత్రమే వినియోగిస్తున్నారు. దీనితో జాతీయ స్థాయి అవార్డుకు సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఎంపికచేశారు. వినూత్న సాంకేతిక పరిజ్ఞానం హైడ్రోబిన్ సిస్టంను వినియోగించడం వల్ల నీటి వినియోగం తక్కువగా ఉంటున్నది. సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం తరపున అధికారులు కే చంద్రలింగం, ఎల్‌జేవీ సుబ్బారావు ఈ అవార్డును అందుకున్నారు.

ఇన్ఫీలో సుధా మూర్తి వాటా 5,600 కోట్లు

ముంబై, మార్చి 8: తాజాగా రాజ్యసభకు నామినేట్ అయిన సుధా మూర్తికి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో రూ.5,600 కోట్ల విలువైన 0.83 శాతం వాటా ఉన్నది. ఇన్ఫీ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి సతీమణి సుధా మూర్తి దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ అంశాలపై పలు పుస్తకాలు సైతం రాశారు. మూర్తి ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. బీఎస్ఈకి ఇన్ఫోసిస్ సమర్పించిన షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం సుధా మూర్తికి కంపెనీలో 3.45 కోట్ల షేర్లు ఉన్నాయి. గురువారంనాటి ఇన్ఫోసిస్ షేరు ముగింపు ధర రూ.1,695 మేరకు వాటి విలువ రూ.5,586.66 కోట్లు. నారాయణ మూర్తికి రూ.2,691 కోట్ల విలువైన 1.66 కోట్ల ఈక్విటీ షేర్లు ఉన్నాయి. మూర్తి దంపతుల కుమార్తె, బ్రిటన్ ప్రధాని రిషిసునక్ సతీమణి అక్షతా మూర్తికి ఇన్ఫోసిస్‌లో 1.07 శాతం వాటా (3.9 కోట్ల షేర్లు), కుమారుడు రోహన్ మూర్తికి 1.67 శాతం వాటా (6.08 కోట్ల షేర్లు) ఉన్నది.



చిన్నమొత్తాలపై వడ్డీ యథాతథం

న్యూఢిల్లీ, మార్చి 8: చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను శుక్రవారం కేంద్ర ప్రభుత్వం యథాతథంగానే ఉంచాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1తో మొదలయ్యే త్రైమాసికానికిగాను ఆయా స్కీములపై వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు ఉండబోవని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీంతో జూన్ 30 వరకు వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉండనున్నాయి. కాగా, ప్రస్తుతం సుకన్య సమృద్ధి స్కీం వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. అలాగే మూడేండ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీరేటు 7.1 శాతం. ఇక ఎంతో ప్రజాదరణ కలిగిన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై 7.1 శాతం, సేవింగ్స్ డిపాజిట్లకు 4 శాతం చొప్పున వడ్డీరేట్లు చెల్లిస్తున్నారు. కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)కు 7.5 శాతంగా, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతంగా వడ్డీరేట్లున్నాయి. మంథ్లీ ఇన్‌కమ్ స్కీం వడ్డీరేటు 7.4 శాతం. ఎక్కువగా పోస్టాఫీసుల ద్వారా నడుస్తున్న ఈ చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం ప్రతీ మూడు నెలలకోసారి సమీక్షిస్తుందన్న విషయం తెలిసిందే.

ఆర్థిక భరోసా అందట్లేదు

మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు సవాల్‌గా ఫండింగ్

న్యూఢిల్లీ, మార్చి 8: ఆర్థిక స్వేచ్ఛ, సాధికారత కోసం పోరాడుతున్న మహిళలు.. ఆంత్రప్రెన్యూర్స్‌గా రంగంలోకి దిగుతున్నారు. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా దాదాపు అన్ని రంగాల్లోనూ అడుగిడుతున్నారు. అయితే ఇప్పుడు వీరందరికీ ఓ ప్రధాన సవాల్ ఎదురవుతున్నది. మదుపరుల విశ్వాసాన్ని చూరగొనడం, వారి నుంచి నిధుల సమీకరణ పొందడంలో అనేక అడ్